సాక్షి నారాయణపేట

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



ఘనంగా చండీహోమాలు

జోగులాంబ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు చండీహోమాలు ఘనంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



.. పోటెత్తిన వేరుశనగ

మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శుక్రవారం పెద్దమొత్తంలో వేరుశనగ వచ్చింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/12.4

ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కనిపిస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శిశు మరణాల రేటు తగ్గించాలి : డీఎంహెచ్‌ఓ



నారాయణపేట: జిల్లాలో శిశు మరణాల రేటు తగ్గించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. సౌభాగ్యలక్ష్మి కోరారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. శిశు మరణాల నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి గల కారణాలను సంబంధిత వైద్యాధికారి, సూపర్‌వైజర్, ఆశా కార్యకర్తలతో విశ్లేషించారు. అనంతరం మాట్లాడుతూ.. శిశు మరణాలు తగ్గించేందుకు గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని, మేనరికపు వివాహాలు చేసుకోకపోవడమే మంచిదన్నారు. ప్రతి గర్భిణికి సంబంధించి గత కాన్పు వివరాలు తీసుకోవాలని, రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి పోషకాహారం అందించాలని సూచించారు. పుట్టిన శిశువుకు సకాలంలో టీకాలు ఇప్పించాలని, పాలు పట్టే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లి బిడ్డల ఆరోగ్యంపై బాలింతలకు ఆశాలు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో వైద్యులు, అధికారులు మహేంద్రవర్మ శైలజ, సాయిరాం, రాఘవేందర్, బిక్షపతి, గోవిందరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర (హిస్టరీ) బోధించేందుకు అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ మెర్సీ వసంత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ పూర్తి చేసిన వారు అర్హులని.. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 3లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సెట్, నెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

జంతు సంరక్షణ బాధ్యత



నారాయణపేట టౌన్: జంతు సంరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డా. ఈశ్వర్‌రెడ్డి అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'పశువుల పరిరక్షణ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. వీధిలో పారవేసిన పాలిథిన్ సంచులు తిని ఆవులు, గేదెలు మృత్యువాత పడుతున్నాయన్నారు. అంతకుముందు పాఠశాల విద్యార్థులతో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డా. అనిరుధ్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

తెల్ల కంది క్వింటా రూ.7,869

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం తెల్ల కంది క్వింటా గరిష్టంగా రూ.7,869, కనిష్టంగా రూ.5 వేల ధర పలికింది. అలాగే ఎర్ర కంది రూ.7,469– రూ.6 వేలు, వేరుశనగ గరిష్టంగా రూ.5,736, కనిష్టంగా రూ.3,820 ధరలు లభించాయి.

ప్రజా యుద్ధనౌక గద్దర్



నారాయణపేట: సామాజిక అసమానతలు, తెలంగాణ సాధన కోసం గళమెత్తిన ప్రజా యుద్ధనౌక గద్దర్ గొప్ప కళాకారుడని జిల్లా పౌరసంబంధాల అధికారి ఎంఏ రషీద్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని జిల్లా సాంస్కృతిక కళాకారులతో కలిసి గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులు తమ ఆటపాటలతో గద్దర్ జ్ఞాపకాలను మననం చేసుకున్నారు.

నిర్మలమ్మ.. కరుణించేనా!

- కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి
- ఉమ్మడి పాలమూరుకు ఏటా నిరాశే
- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సాయం అందేనా?



సాక్షి, నాగర్‌కర్నూల్:

కేంద్ర ప్రభుత్వం నేడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉన్న రైల్వే ప్రాజెక్టులకు ఈసారైనా నిధులు కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారుల విస్తరణ, కొత్తగా రోడ్ల నిర్మాణానికి నిధులు అందజేస్తారన్న అంచనాలు ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్నా.. నిరాశే ఎదురవుతుంది. ఈ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే ఈ విషయంలో ప్రతిసారి కేంద్రం నుంచి రిక్తహస్తం ఎదురవుతోంది. ఈసారైనా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉమ్మడి జిల్లాకు నిధులు అందుతాయన్న ఆశలు నెలకొన్నాయి.

రహ'దారుల'పై ఆశలు..

ఉమ్మడి జిల్లామీదుగా వెళ్లే హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి ఎన్‌హెచ్–44ను ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి పరుస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే ఇందుకు అవసరమైన అడుగులు మాత్రం ముందుకు పడలేదు. అలాగే హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై సుమారు 63 కి.మీ. మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. ఇందుకోసం పనులు డీపీఆర్ దశలో ఉన్నాయి. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు జాతీయ రహదారి పనులు ప్రారంభమైనా, సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుకాలేదు. టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులను వేగవంతం చేయాల్సి ఉంది. నల్లమలలోని పదర మండలం మద్దిమడుగు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మించి ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలను మరింత సులభం చేయాలన్న అంశం ఇంకా ప్రతిపాదన దశలోనే ఉంది.

పర్యాటక అభివృద్ధికి ఊతం ఇచ్చేనా?

ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నా నిధులు, ప్రోత్సాహం లేక ఆశించినంత పురోగతి సాగడం లేదు. నల్లమల అటవీప్రాంతం, సుందరమైన కృష్ణాతీర ప్రాంతాలు, పురాతన దేవాలయాలతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పర్యాటకాభివృద్ధికి అవకాశం ఉన్నా ఆ దిశగా దృష్టిపెట్టడం లేదు. ఉమ్మడి జిల్లాలోని దర్శనీయ ప్రదేశాలతో టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పరిశ్రమలు కరువు..



వలసల జిల్లాగా పేరొందిన ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు పెద్దగా పరిశ్రమలను ఏర్పాటు చేయలేదు. పెద్ద సంఖ్యలో స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉపాధి కల్పనకు ఎలాంటి పరిశ్రమలు లేకపోవడంతో ఇంకా హైదరాబాద్, ఇతర జిల్లాలకు వలసలు కొనసాగుతున్నాయి. విద్యాభివృద్ధికి అవసరమైన నిధులతో పాటు కేంద్రం నుంచి కొత్త జిల్లాలకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేస్తే ప్రయోజనం కలుగనుంది. నారాయణపేటలో మంజూరైన సైనిక్ పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉంది.



వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని గణప సముద్రం

ఎత్తిపోతలు సరే.. రిజర్వాయర్లేవి?

- ప్రతిపాదనలను దాటని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం
- వరదలు వస్తున్నా కృష్ణా, తుంగభద్ర నీటిని ఒడిసిపట్టుకోలేని దుస్థితి
- భారీ సామర్థ్యం గల జలాశయాలు లేక నెరవేరని లక్ష్యం
- పాలమూరులో పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాని ఆయకట్టు
- కేఎల్‌ఐ, తుమ్మిళ్ల పెండింగ్ ప్రతిపాదనలపై రైతుల ఎదురుచూపులు



మల్లమ్మకుంట రిజర్వాయర్ చిత్రపటాన్ని పరిశీలిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: చెంతనే కృష్ణా, తుంగభద్ర నదులు ఉన్నా.. ఉప్పొంగి ప్రవహిస్తున్నా.. ఆ నీటిని ఒడిసిపట్టుకోలేని దుస్థితి పాలమూరుది. నదీ నీటి మట్టం కంటే ఎక్కువ ఎత్తులో ఉండడమే ఇందుకు కారణం కాగా.. ఎత్తిపోతల పథకాలకు అంకురార్పణ జరిగింది. 2004లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి ఎత్తిపోతల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఎత్తిపోతల పథకాల్లో భాగంగా చేపట్టాల్సిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణాలు ఇప్పటికీ ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కొన్నింటిని నిర్మించినప్పటికీ.. నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండడంతో ఆయకట్టు చివరి వరకు ఒక్క పంటకు సైతం పూర్తిస్థాయిలో నీరందడం లేదు. ప్రధానంగా కల్వకుర్తి, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాల్లో పలు రిజర్వాయర్ల నిర్మాణాలు అటకెక్కగా.. వాటి పరిధిలోని ఆయకట్టు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కేఎల్‌ఐ.. ప్రతిపాదనలకే పరిమితం

మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎల్‌ఐ)లో ఇప్పటివరకు నాలుగు రిజర్వాయర్లు నిర్మించారు. ఎల్లూరు 0.35 టీఎంసీలు, సింగోటం 0.55 టీఎంసీలు, జొన్నలబొగుడ 2.14 టీఎంసీలు, గుడిపల్లిగట్టు 0.96 టీఎంసీలు.. అన్ని కలిపి దాదాపు నాలుగు టీఎంసీల నిల్వ సామర్థ్యం గలవి ఉన్నాయి. కృష్ణానదికి సాధారణంగా 60 వరద రోజులు కాగా.. ఒక్కోసారి ఎక్కువ నమోదు కావొచ్చు. మొత్తం నాలుగు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్లలో 40 టీఎంసీలను ఎత్తిపోసేలా సమర్థవంతమైన నిర్వహణ కుదరడం లేదు. దీంతో కల్వకుర్తి కింద ప్రస్తుతం మూడు లక్షల ఎకరాలు మాత్రమే సాగవుతోంది. ఈ ఎత్తిపోతల కింద నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండడంతో 47 అదనపు రిజర్వాయర్లను నిర్మించాలని అధికారులు చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి.

సాగునీరు అందించాలి..



కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద రిజర్వాయర్లు లేక సరిగా నీటిని వినియోగించుకోలేకపోతున్నాం. కాల్వల ద్వారా నీరు కొన్ని ఎకరాలకే అందుతుంది. సీజన్‌లో తరచుగా కాల్వలకు గండ్లు పడి తెగుతున్నాయి. బొల్లంపల్లి, పోతెపల్లిలోని తిరుపతి చెరువు, సిల్లోనిబండ తండా చెరువులను రిజర్వాయర్లుగా మారుస్తామని చెప్పి ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. త్వరగా రిజర్వాయర్లను ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి. – జంగయ్య, రైతు, చొక్కనపల్లి, వెల్దండ మండలం

రిజర్వాయర్ నిర్మిస్తే మేలు



మాకు వడ్డేపల్లి మండలం 26 డిస్ట్రిబ్యూటరీ కింద భూమి ఉంది. అందులో ప్రస్తుతం 5 ఎకరాల మొక్కజొన్న పంట సాగు చేశాను. కాగా ఆర్‌డీఎస్ కెనాల్ ద్వారా వచ్చే నీటిపై ఆధారపడే పంటలు సాగు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో కెనాల్‌లో నీరు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు రాదో తెలియని పరిస్థితి.ప్రతి ఏటా రెండో పంట వేయాలంటే భయంగానే ఉంటుంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల నిర్మించినప్పటికీ, రిజర్వాయర్ లేకపోవడంతో దాని వల్ల కలిగే ప్రయోజనం నామమాత్రంగానే ఉంటుంది. రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందాలంటే రిజర్వాయర్ నిర్మించాలి. – రంగారావు, రైతు, శాంతినగర్

ప్రతిపాదన దశలోనే..

కల్వకుర్తి కింద కొత్తగా రిజర్వాయర్ల ఏర్పాటు ప్రతిపాదన దశలో ఉంది. అవసరమైన చోట రిజర్వాయర్లను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే ఉన్న చెరువులను రిజర్వాయర్లుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఎక్కువ నీటిని నిల్వచేసేలా ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు కొనసాగిస్తాం. – విజయభాస్కర్‌రెడ్డి, సీఈ, నీటిపారుదల శాఖ

చివరకు 20లో 2 మాత్రమే..

అదనపు రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణ, అధిక ఆర్థిక భారం కానున్న నేపథ్యంలో ఎంజీకేఎల్‌కే ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీల వెంట ఉన్న 20 ఆన్‌లైన్ చెరువులను రిజర్వాయర్లుగా మార్చాలని నిర్ణయించారు. వనపర్తి నియోజకవర్గంలో గొల్లపల్లి, గోపాల్‌పేట, ఖిల్లాఘనపురంలోని గణపసముద్రం, బుద్దారం, గట్ల ఖానాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో వడ్డెమాన్, ఇంద్రకల్, బలాన్‌పల్లి, నేరెళ్లపల్లి, చిన్నముద్దనూరు, గడ్డంపల్లి, కల్వకుర్తి నియోజకవర్గంలో మాదారం, జూపల్లి, ఆలమెట్ట బావి తండా, బొల్లంపల్లి, జిల్లారం తండా.. కొల్లాపూర్ నియోజకవర్గంలో పాన్‌గల్ చెరువు, అచ్చంపేట నియోజకవర్గంలో ఉప్పునుంతల, తాడూరు చెరువులను రిజర్వాయర్లుగా మార్చేందుకు అవసరమైన అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఆయా చెరువుల పరిధిలో మొత్తం 9.95 టీఎంసీల నీటిని నిల్వ చేయొచ్చని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇందులో రూ.87 కోట్ల వ్యయంతో బుద్దారం, గణపసముద్రం చెరువులను రిజర్వాయర్లుగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు కొనసాగుతుండగా.. మిగతా వాటివి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

వెక్కిరిస్తున్న 'తుమ్మిళ్ల'..

ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రూపకల్పన చేసిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం వెక్కిరిస్తూనే ఉంది. మొత్తం 57,900 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలనే లక్ష్యంతో ఈ పథకానికి రూ.1,197.77 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు రూ.829.36 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం తుంగభద్ర నదికి సంబంధించి సుంకేసుల బ్యాక్ వాటర్ నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా నీటిని పంప్‌హౌస్‌కు తరలించి.. అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసి ఆర్డీఎస్ కాల్వలో డీ–23 వద్ద వదులుతున్నారు. అప్రోచ్ కెనాల్, పంప్ హౌస్, డెలివరీ సిస్టర్న్ నిర్మాణాలు మాత్రమే పూర్తి కాగా.. నిర్మించాలనుకున్న మూడు ప్రధాన రిజర్వాయర్ల నిర్మాణాల ఊసే లేకుండా పోయింది. ఫలితంగా లక్ష్యంలో సగం ఎకరాలకు కూడా నీరందని పరిస్థితి.

జీఓ దాటని 'మల్లమ్మకుంట'..

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా మల్లమ్మకుంట (1.03 టీఎంసీలు), జూలకల్ (టీఎంసీ), వల్లూరు (1.02 టీఎంసీలు) రిజర్వాయర్లను నిర్మించాలని ప్రతిపాదించారు. పాలకులు పట్టించుకోకపోవడంతో ఇవి అటకెక్కాయి. 2023 ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి, జీఓ విడుదల చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. భూసేకరణ సమస్యతో మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణంపై ఇప్పటివరకు మరో అడుగు ముందుకుపడలేదు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ వైపు పల్లం ఉండడంతో వరద వచ్చిన సమయంలోనూ తెలంగాణ వైపు ఎత్తిపోతలకు తిప్పలు తప్పకపోవడంతో తుమ్మిళ్ల ఎత్తిపోతల నిర్వహణ అస్తవ్యస్తంగా మారినట్లు తెలుస్తోంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్.. సమావేశంలో పాల్గొన్న అధికారులు

- పుర పరిధిలోకి భీంపూర్, నాగంపల్లి, సాపన్‌చెరువుతండా, ఎర్రగుంటతండా
- ఉమ్మడి మద్దూరు మండల అధికారులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష

మద్దూరు: సంక్షేమ పథకాలు అర్హులకే అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మద్దూరు మండలంలోని వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హుల జాబితాను ఏ ప్రాతిపదికన తయారు చేశారని ప్రశ్నించారు. సీఎం ప్రాతినిత్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో మండలం ఉందనే విషయాన్ని గుర్తించి పనిచేయాలని.. ఏ చిన్న పొరపాటు జరిగినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్ష ఉంటుందని ముందుగానే సమాచారం ఇచ్చినా పూర్తి వివరాలతో ఎందుకు రాలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఎంఈఓ బాలకిష్టప్పను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలను తనిఖీ చేసి మెనూ పాటించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మద్దూరు పక్కనే ఉన్న భీంపూర్, నాగంపల్లి, సాపన్‌చెరువుతండా, ఎర్రగుంటతండాలను పురపాలికలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని.. ఆయా గ్రామాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో మండల ప్రత్యేక అధికారి, డీఎస్‌ఓ సుదర్శన్, తహసీల్దార్లు మహేష్‌గౌడ్, జయరాములు, ఎంపీడీఓలు నర్సింహారెడ్డి, కృష్ణారావు, ఎంఈఓ బాలకిష్టప్ప, ఎంపీఓ రామన్న, ఇరిగేషన్ ఏఈ మమత, ఏఓ రామకృష్ణ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..

పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్ తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రూ.కోట్లతో అన్ని వసతులతో నిర్మించిన ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను ఎందుకు వినియోగించడం లేదని వైద్యులను ప్రశ్నించారు. వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని.. నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఏడుగురు వైద్యులున్న ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులను నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రులకు పంపించడం సరికాదని.. ఇంకోసారి రెఫర్ అన్న మాట రావొద్దని ఆస్పత్రి సమన్వయకర్త డా. పావనికి సూచించారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

నారాయణపేట: పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో జిల్లాలోని 88 పాఠశాలలకు చెందిన యాక్టివ్ ఉపాధ్యాయులకు 'కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్' అనే అంశంపై రెండ్రోజులుగా శిక్షణ కొనసాగుతుంది. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెడితే ఆశించిన ఫలితాలు వస్తాయని.. మిగతా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు వివరించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు పరీక్షలంటే భయం, ఆందోళన తొలగించాలని సూచించారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. శిక్షణ కార్యక్రమం నిర్వహించిన విద్యాశాఖను కలెక్టర్ అభినందించారు. డీఈఓ గోవిందరాజులు, ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.

బాలసదన్ తనిఖీ..

జిల్లాకేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో ఉన్న బాలసదన్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేసి గదులు, వంటశాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. నూతన నిర్మాణాలకు స్థల పరిశీలన చేశారు.

పెట్రోల్ బంక్ పరిశీలన..

జిల్లాకేంద్రం సమీపంలోని సింగారం వద్ద జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ సహకారంతో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించే పెట్రోల్‌బంక్‌ను శుక్రవారం రాత్రి కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు.పెండింగ్ పనులుంటే ప్రారంభం తర్వాత పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట అడిషనల్ డీఆర్డీఓ అంజయ్య, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, ఉన్నారు.

గజవాహనంపై ఊరేగిన అంజన్న



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి శుక్రవారం గజవాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం గజ వాహనసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. హనుమాన్ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. – ఊర్కొండ

మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం



రేవంత్‌రెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం.. ఎమ్మెల్యేతో సంప్రదించి బ్రహ్మోత్సవాలకు ఏ రోజు వచ్చేది చెబుతానని పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మన్యంకొండ దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాల్వలో మృతదేహం లభ్యం

మక్తల్: మండలంలోని సంగంబండ గ్రామంలో కాల్వలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సాబేప్ప(35) అనే వ్యక్తి ఈనెల 28వ తేదీన రాత్రి బయటికెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య తాయమ్మ తన భర్త కనిపించడం లేదని మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా శుక్రవారం సాబేప్ప మృతదేహం కాల్వలో కనిపించింది. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

చారకొండ: ఓమైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై పోక్సో కేసును శుక్రవారం నమోదు చేసినట్లు వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. చారకొండకు చెందిన మహేష్‌గౌడ్ అనే యువకుడు, అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసేవాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూర్: జీవితంపై విరక్తిచెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ఆరేపల్లికి చెందిన వెంకటన్న(52) అనారోగ్యం కారణంగా ఈనెల 25న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గట్టు : మండలంలోని తప్పెట్లమొర్సు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి రాయచూర్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. తప్పెట్లమొర్సు గ్రామం దాటిన తర్వాత కాల్వగట్టు దగ్గర బియ్యం బస్తాల లోడుతో వెళ్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో సుమారు 30క్వింటాళ్ల దాకా రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం. పట్టుబడిన రేషన్‌బియ్యం బస్తాలతో వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన రేషన్‌బియ్యం విషయమై కేసు నమోదుకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

పట్టపగలే ఇంటి తాళం పగలగొట్టి చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆత్మకూర్: తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని మూలమళ్లకు చెందిన గడ్డం సహదేవుడు కుటుంబంతో కలిసి ఆత్మకూర్‌లోని అయ్యప్పకాలనీలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి భార్యాభర్తలు వ్యవసాయ పొలానికి వెళ్లి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి రాగా.. అప్పటికే తాళం పగులగొట్టి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయని వస్తువులు, బట్టలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయని బాధితుడు వాపోయాడు. బీరువాలోని ఆరు తులాల బంగారు నగలు, రూ.50 వేలు నగదు చోరీకి గురయినట్లు తెలిపారు. చోరీపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

వ్యక్తికి ఏడాదిన్నర జైలుశిక్ష

ఆత్మకూర్: వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి యువకుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.1,500 జరిమానా న్యాయమూర్తి విధించారని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. 2016 ఆగస్టు 15న పుష్కరాల సందర్భంగా మహబూబ్‌నగర్‌కు చెందిన హరిప్రకాష్, గంగరాజు, రాఘవేందర్ బైకుపై జూరాల డ్యాంకు వస్తుండగా ఆత్మకూర్ శివారులో ట్రాక్టర్ ఢీకోవడంతో హరిప్రకాష్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ముడావత్ రాజారాంసింగ్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ నగేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆత్మకూర్ ఎస్‌ఐ నరేందర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రాజేందర్ కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ నగేష్‌కు న్యాయమూర్తి జానకి శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ, కోర్టు డ్యూటీ పోలీసులను అభినందించి, రివార్డు అందించనున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో కుప్పలుగా పోసిన వేరుశనగ

పోటెత్తిన పల్లి

మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శుక్రవారం పల్లి(వేరుశనగ) పోటెత్తింది. మూడు రోజుల క్రితం రైతులు వేరుశనగకు ధర పెంచాలని ఆందోళన చేపట్టారు. అప్పటికే టెండర్ అయిన పల్లికి క్వింటాల్‌కు రూ.200 అదనంగా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత ప్రకటించారు. బుధవారం అమావాస్య, గురువారం మార్కెట్‌యార్డులో ఉన్న వేరుశనగను తరలించేందుకు సెలవులు ఇచ్చారు. రెండు రోజుల సెలవు తర్వాత శుక్రవారం మార్కెట్‌కు దాదాపు 35వేల బస్తాల పల్లిని మార్కెట్‌కు వివిధ వాహనాల్లో రైతులు తీసుకొచ్చారు. దీంతో మార్కెట్‌యార్డులో ఎక్కడ చూసినా వేరుశనగ కుప్పలే కనిపించాయి. ఒకపక్క పంటకు గిట్టుబాటు ధర రాక.. మరోపక్క పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో.. రాదోనని రైతులు దిగాలు చెందుతున్నారు.

– మహబూబ్‌నగర్ (వ్యవసాయం)

దేవరకద్ర ఇక పురపాలికం



దేవరకద్ర పట్టణ వ్యూ

- కమిషనర్ నియామకం
- పూర్తయిన ఫైళ్ల అప్పగింత
- ఇప్పటికే గెజిట్ విడుదల
- 12 వార్డులుగా విభజన



పురపాలక సంఘ కార్యాలయంగా మారిన దేవరకద్ర పాత పంచాయతీ భవనం

దేవరకద్ర: అయిదు దశాబ్దాలుగా మేజర్ గ్రామ పంచాయతీగా సేవలు అందించిన దేవరకద్ర ఎట్టకేలకు మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. గ్రామ పంచాయతీ భవనంపై పురపాలక సంఘ కార్యాలయంగా పేరు మార్చారు. ఈఓ స్థానంలో కమిషనర్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అలాగే పంచాయతీలో ఉన్న ఫైళ్లు అన్నింటిని కమిషనర్‌కు అప్పగించారు.

డిసెంబర్ 19న అసెంబ్లీలో ప్రకటన

గతేడాది డిసెంబర్ 19న అసెంబ్లీలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ బోయే 12 మున్సిపాలిటీలను మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించగా.. అందులో దేవరకద్రకు చోటు దక్కింది. రెండు వారాల క్రితం దేవరకద్ర మున్సిపాలిటీని 12 వార్డులుగా విభజన చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేశారు. అయితే వార్డులకు సంబంధించి పరిధిని, ఓటర్లను ఇంకా కేటాయించాల్సి ఉంది.

మున్సిపాలిటీగానే ఎన్నికలు..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల పదవి కాలం జనవరి 26తో ముగియడంతో.. వాటికి ఎన్నికల నిర్వహించినప్పుడే దేవరకద్ర మున్సిపాలిటీకి తొలిసారి ఎన్నికలు జరగనున్నాయి. దేవరకద్రతో పాటు మిగతా నాలుగు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు ఇక ఉండవు. విలీన గ్రామాలను మున్సిపల్ వార్డులుగా మార్చే అవకాశం ఉంది.

నాలుగు గ్రామాలు విలీనం

దేవరకద్ర పట్టణంతో పాటు చౌదర్‌పల్లి, బలుసుపల్లి, పెద్ద గోప్లాపూర్, మీనుగవానిపల్లి గ్రామాలను దేవరకద్ర మున్సిపాలిటీలో విలీనం చేశారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కింద విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులంతా మున్సిపాలిటీ పరిధిలోకి వస్తారు. దీనికి సంబంధించిన పక్రియ మొదలయింది. దేవరకద్ర నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో బల్సుపల్లి, మూడు కిలో మీటర్ల దూరంలో పెద్ద గోప్లాపూర్, మీనుగోనిపల్లి, నాలుగు కిలో మీటర్ల దూరంలో చౌదర్‌పల్లి ఉంది. పట్టణానికి సమీపంలోనే గ్రామాలు ఉండడంతో వాటి పరిధిలోని భూమలన్నీ మున్సిపాలిటీ పరిధిలోకి వస్తాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం..

గ్రామాలు	జనాభా	2023 ప్రకారం ఓటర్లు
దేవరకద్ర	8,047	6,315
చౌదర్‌పల్లి	1,809	1,114
బలుసుపల్లి	627	643
పెద్దగోప్లాపూర్	840	593
మీనుగోనిపల్లి	946	707
మొత్తం	12269	9372

నేటి నుంచి 'పది' విద్యార్థులకు అల్పాహారం



గార్లపాడ్ పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి (ఫైల్)

జిల్లా పేరు	విద్యార్థులు	అందిస్తున్న నిధులు (రూపాయలు)
మహబూబ్‌నగర్	4,747	27,05,790
గద్వాల	2,834	16,20,510
నాగర్‌కర్నూల్	3,873	22, 07, 610
నారాయణపేట	3,510	20,00,700
వనపర్తి	3,013	17,17,410

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో చదువుతున్న ఎస్సెస్సీ(పదో తరగతి) విద్యార్థులకు ప్రభుత్వం నేటి నుంచి అల్పాహారం అందిచేందుకు నిధులను విడుదల చేసింది. ఈమేరకు ప్రతి రోజు సాయంత్రం జరుగుతున్న ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో రూ.15 విలువ చేసే స్నాక్స్‌ను అందించనున్నారు. ఈ కార్యక్రమం నేటి(శనివారం)నుంచి మొదలై మార్చి 20వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్న 38 రోజుల పాటు విద్యార్థులకు ఈ సదుపాయం కల్పించనున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు వినేందుకు అడ్డంకులు తప్పనున్నాయి.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో రన్నరప్‌గా బాలికల జట్టు



బాలికల జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మెదక్ జిల్లా తూప్రాన్‌లో శుక్రవారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచింది. ఈ టోర్నమెంట్‌లో బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈజట్టును జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, పీడీలు అభినందించారు.

తమ్ముడిని బస్సు ఎక్కించేందుకు వెళ్తూ..

- అనంత లోకాలకు అన్న
- తమ్ముడికి తీవ్రగాయాలు



ఆంజనేయులు (ఫైల్)



మన్యంకొండ దగ్గర గాయపడిన యువకులను రోడ్డు పక్కకు తీస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మహబూబ్‌నగర్ క్రైం: గుంటూర్‌లో ఇంటర్ చదువుతున్న తమ్ముడిని బస్సు ఎక్కించేందుకు వెళ్తూ జరిగిన ప్రమాదంలో అన్న మృతిచెందగా, తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండలంలోని పోతన్‌పల్లికి చెందిన పెంటయ్యకు ఇద్దరూ కొడుకులు. ఆంజనేయులు(21), కేశవులు(19). అయితే కేశవులు గుంటూర్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున పోతన్‌పల్లి నుంచి పల్సర్ బైక్‌పై ఆంజనేయులు, కేశవులు మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో మన్యంకొండ స్టేజీ దగ్గర గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా ఆంజనేయులు మృతిచెందాడు. ప్రస్తుతం కేశవులు ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తండ్రి పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకులను చూసి చలించి మానవత్వం చాటారు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి. మన్యంకొండ దగ్గర శుక్రవారం తెల్లవారుజామున కొందరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్పృహ తప్పి పడిపోయారు. అదే సమయంలో మక్తల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన వాహనం ఆపి యువకులను రోడ్డుపక్కకు జరిపారు. 108 వాహనంకు ఫోన్‌చేసి ఆపదలో ఉన్న యువకులకు నీళ్లు తాగించారు. అనంతరం క్షతగాత్రులను చికిత్స కోసం 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే మానవత్వం చాటడంతో పలువురు ఆయనను ఈసందర్భంగా అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పీయూ వీసీ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దిచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మనం నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ద్వారా ఎదుటి వారు ఇబ్బందులు పడొద్దన్నారు. రోడ్డు నిబంధనలపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. పీయూలోకి వచ్చే ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరిస్తేనే అనుమతి ఉండే విధంగా నిబంధనలు విధిస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ జానకి మాట్లాడుతూ గతేడాది మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 273 ప్రమాదాలు జరగగా.. ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలువురు క్షతగాత్రులుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి బయటికి వెళ్లే ప్రతి వ్యక్తి తన కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారనే ధ్యాసతో వాహనాలు నడపాలని కోరారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా పెద్ద ప్రమాదాలను తప్పించే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రార్ చెన్నప్ప, అర్జున్‌కుమార్, పోలీస్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కవితా పుష్పాలు' పుస్తకావిష్కరణ



'కవితా పుష్పాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ జెడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు, రచయిత్రి పుష్పలత రచించిన 'కవితా పుష్పాలు' అనే పుస్తకాన్ని డా.చెగిరెడ్డి కృష్ణారెడ్డి, డా.పొద్దుటూరి ఎల్లారెడ్డి, రావూరి సూర్యనారాయణ ఘనంగా ఆవిష్కరించారు. శుక్రవారం పుష్పలత పదవీ విరమణ పొందగా ఆమెను ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన అనేక రచనలను కవయిత్రి డా.శాంతారెడ్డి సమీక్ష చేసి వివరించారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, డా.బాలస్వామి, అరుణమ్మ రాజు, తులసీరాంనాయక్, శివలీల పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

ఘనంగా చండీహోమాలు



జోగుళాంబ అమ్మవారి ఆలయంలో హోమాలు



సహస్ర ఘటాలకు ప్రత్యేక పూజలు

రెండో రోజు ప్రత్యేక పూజలు

అలంపూర్ : శ్రీజోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో విశేష అర్చనలు, చండీ హోమాలు, పవమాన సూక్త పారాయణ, పవమాన సూక్త హోమాలు, అవాహిత దేవతా హోమాలు, మండప ఆరాధన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు విశేషంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అమ్మవారి యాగశాలలో హోమాలు ప్రత్యేకంగా జరిగాయి. మరో మూడు రోజుల పాటు అమ్మవారి ఆలయంలో వార్షిక ఉత్సవాల పూజలు కొనసాగనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. ఉత్సవాల చివరిరోజు శ్రీజోగుళాంబ అమ్మవారికి సహస్రఘటాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు అమ్మవారి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కలుగుతుందని తెలిపారు. అమ్మవారి నిజరూప దర్శనానికి భక్తులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

పద్యనాటక ప్రదర్శనలు ఘనంగా నిర్వహిద్దాం

- 15నుంచి 18వ తేదీ వరకు ప్రదర్శనలు
- శ్రీమిత్రకళా నాట్యమండలి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

స్టేషన్‌మహబూబ్‌నగర్: మన్యకొండ క్షేత్రంలో పద్యనాటక ప్రదర్శనలు ఘనంగా నిర్వహిద్దామని శ్రీమిత్రకళా నాట్యమండలి అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి అన్నారు. మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో దేవాలయం ప్రాంగణంలో ఈనెల 15నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పద్యనాటక ప్రదర్శనల పోస్టర్‌ను శుక్రవారం తన నివాసగృహంలో మనోహర్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పద్యనాటక ప్రదర్శనలను భక్తులు తిలకించాలని ఆయన కోరారు. ఆ నాట్యమండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ పదేళ్ల నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తమ సంస్థ ఆధ్వర్యంలో పద్యనాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15న శాస్త్రీయ నృత్య ప్రదర్శన, మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయం, శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం పూర్తినాటకం, 16న శ్రీరామాంజనేయ యుద్ధ సన్నివేశం, అశ్వద్ధామ పద్యనాటకం, శ్రీకృష్ణరాయబారం, 17న శ్రీకృష్ణాంజనేయ యుద్ధ ఘట్టం, మయసభ దుర్యోధన, 18న అన్నమయ్య సంకీర్తనాలహరి, భజనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు నాయిని భాగన్నగౌడ్, డీకే ఆంజనేయులు, కళా నాట్యమండలి సభ్యులు సలీం, నర్సింలు, భాస్కరాచారి, రాజు, దత్తాత్రేయచారి, రామకృష్ణ, కృష్ణయ్య, సత్తయ్య, సుధాకరాచారి, గంగన్న పాల్గొన్నారు.

వైభవంగా అంకురార్పణం



అంకురార్పణ చేస్తున్న పండితులు

జడ్చర్ల టౌన్: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అంకురార్పణం వైభవంగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, మృత్సంగ్రహణం చేసి రాత్రికి అంకురార్పణం జరిపించారు. తరువాత మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పుట్టమన్ను తీసుకొచ్చి హోమగుండం నిర్మాణం చేసి అగ్నిప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో భాగంగా చెన్నకేశవనామస్మరణల మధ్య గ్రామ వీధుల్లో స్వామి పల్లకీసేవ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్‌లో కొనసాగుతున్న శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్పీ జానకి తెలిపారు. శుక్రవారం ఆమె గంగాపూర్ గ్రామంలో స్వామివారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రథోత్సవం, శకటోత్సవం కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్లుగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. తోపులాట, తొక్కిసలాటలు చోటుచేసుకోకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ శివానందంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.